క్లుప్తంగా

గురుకుల విద్యార్థుల క్షేత్ర సందర్శన



తిరువూరు: స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు బుధవారం వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో క్షేత్ర సందర్శనకు వెళ్లారు. తొమ్మిదో తరగతి విద్యార్థులకు కళాశాలలోని ప్రయోగశాలలు, వాటిలోని పరికరాల గురించి ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు వివరించారు. ఎలక్ట్రానిక్ పరికరాలు, యంత్రాల పని విధానం, మారుతున్న సాంకేతిక విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోటిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీకి నివాళి



తిరువూరు: ఛత్రపతి శివాజీ జయంతి కార్యక్రమం గంపలగూడెం మండలం పెనుగొలను ఎంపీపీ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏవీ నరసింహారావు మాట్లాడుతూ శివాజీ ధైర్యసాహసాలు, దేశభక్తి, పాలనా దక్షతను వివరించారు. సాయిబాబా మందిర కమిటీ సభ్యులు విద్యార్థులకు పెన్నులు పంపిణీ చేశారు. పెనుగొలను శాఖా గ్రంథాలయాధికారి శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయ కరాటే పోటీల్లో తిరువూరు బాలల ప్రతిభ



తిరువూరు: బాపట్ల జిల్లా అద్దంకిలో డ్రాగన్ షోటోఖాన్ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే, కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ పోటీల్లో తిరువూరు విద్యార్థులు పలు బహుమతులు గెలుచుకున్నారు. హర్షా కరాటే స్కూల్‌కు చెందిన ఎస్‌కే చాహల్, సాయికిరణ్‌రెడ్డి, ఎస్‌కే వాహిద్, భానుప్రకాష్‌రెడ్డి, దేవాన్ష్, కార్తీక్, ఆద్విక, సాయి, రియాన్షి, ప్రణతి, చైతన్య ప్రథమ స్థానం సాధించారు. సీహెచ్ రిత్విక్, మానస్వి, పద్మ, రాజా ఆయాన్‌చంద్, దాక్షణ్య, కార్తీక్, రియాన్షిత ద్వితీయ స్థానంలో, వరుణ్, నిహాల్, కుమిదిని తృతీయ స్థానంలో నిలిచారని కోచ్ నాగేశ్వరరావు తెలిపారు.

కళ్లజోళ్ల పంపిణీ



తుమ్మలపాలెం(ఇబ్రహీంపట్నం): ఉచిత వైద్య శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన 194 మందికి బుధవారం పంపిణీ చేశారు. ఎన్టీటీపీఎస్ ఆధ్వర్యంలో తుమ్మలపాలెం గ్రామంలో జనవరి 29న ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. అప్పట్లో శిబిరానికి హాజరైన 194 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. వారందరికీ ఎన్టీటీపీఎస్ పర్యావరణ ఎస్ఈ ఉమామహేశ్వరరావు కళ్లజోళ్లు అందజేశారు. అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

తమ్మిలేరు రిజర్వాయర్ మరమ్మతు పనులు



చాట్రాయి: మండలంలోని తమ్మిలేరు రిజర్వాయర్ ప్రాజెక్టు మరమ్మతుల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జైకా నిధులు రూ.16 కోట్లతో కాలువల మరమ్మతులు, రిటైనింగ్ వాల్, మూడు కాలువలకు రక్షణ గోడలు, రెగ్యులేటర్, తూముల మరమ్మతులు చేపట్టారు. పనులు పూర్తయితే లింగపాలెం, చాట్రాయి మండలాల్లోని గ్రామాలకు సాగునీరు సవ్యంగా అందుతుందని రైతులు చెబుతున్నారు. వచ్చే ఖరీఫ్ కల్లా పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

బెల్లపు ఊట ధ్వంసం

ఆగిరిపల్లి: తోటపల్లిలో బుధవారం ఎక్సైజ్ అధికారులు సారా స్థావరాలపై దాడి చేశారు. సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేస్తున్న రాజులపాటి సత్యనారాయణపై కేసు నమోదు చేశామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అజయ్ కుమార్‌సింగ్ తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ మస్తానయ్య, ఎస్ఐ అలీం, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేతోనే సరా!

- గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే రూ.25 కోట్లు మంజూరు
- ప్రారంభం కాని బైపాస్‌రోడ్డు పనులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం
- బైపాస్ రోడ్డు కోసం ఎదురుచూస్తున్న రైతులు, ప్రజలు

నూజివీడు: రెవెన్యూ డివిజన్ కేంద్రమైన నూజివీడు పట్టణానికి మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డు వరకు మంజూరైన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు సర్వేకే పరిమితమయ్యాయి. పనులు ఎప్పుడు ప్రారంభమవుతాయోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. బైపాస్ రోడ్డు నిర్మాణానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ కష్టాలకు తెరపడినట్లేనని స్థానికులు భావించారు. ఈ బైపాస్ రోడ్డు ట్రిపుల్ ఐటీ వెనుక భాగం నుంచి గొడుగువారిగూడెం మీదుగా పెద్ద చెరువు కళంగి పైభాగాన విస్సన్నపేట రోడ్డుకు కలుస్తుంది. ఈ బైపాస్ రోడ్డు నిర్మాణానికి సుమారు 22.50 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉండగా, దీనికి సంబంధించి ప్రభుత్వం భూసేకరణ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రైతులు భూమిని ఇవ్వడానికి అప్పట్లో అంగీకరించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రోడ్డు నిర్మాణాన్ని పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ఎక్కడి నుంచి ఎక్కడి కంటే..

బైపాస్ రోడ్డును మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డు వరకు గొడుగువారిగూడెం ఎగువ భాగం మీదుగా నిర్మించనున్నారు. రోడ్డు పొడవు మొత్తం 4.30 కిలోమీటర్లు కాగా, వెడల్పు 10 మీటర్లు. ఈ మార్గంలో బిల్లుడు వాగుపై వంతెనను నిర్మించడంతో పాటు మరో రెండు శ్లాబ్ కల్వర్టులను నిర్మిస్తారు. బైపాస్ రోడ్డుకు అవసరమైన భూమిని సేకరించేందుకు అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు భూముల యజమానులతో నిరంతరం చర్చిస్తూ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ భూమిని ఇచ్చేలా అంగీకరింప జేశారు.





బైపాస్ రోడ్డు నిర్మించేందుకు సర్వే పూర్తి చేసిన మట్టి రోడ్డు : మైలవరం రోడ్డు నుంచి విస్సన్నపేట రోడ్డు వరకు నిర్మించనున్న ప్రతిపాదిత బైపాస్ రోడ్డు

నిర్మాణం పూర్తయితే ప్రయోజనాలు ఇవి..

హైదరాబాద్ నుంచి ఏలూరు వైపు వెళ్లే భారీ వాహనాలతో పాటు ఇబ్రహీంపట్నం, కొండపల్లి, జి.కొండూరు, గంపలగూడెం మండలం వినగడప ప్రాంతాల్లో ఉన్న స్టోన్‌క్రషర్ల నుంచి కంకర లారీలు నిత్యం నూజివీడు మీదుగా పశ్చిమ గోదావరి జిల్లాకు రాకపోకలు సాగిస్తుంటాయి. 40 టన్నుల నుంచి 60 టన్నుల లోడుతో భారీ వాహనాలు పట్టణంలోకి వస్తుండటంతో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో బైపాస్ రోడ్డు నిర్మాణం పూర్తయితే నూజివీడు పట్టణానికి ట్రాఫిక్ కష్టాలు తీరినట్లేనని పట్టణ ప్రజలు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఎనిమిది నెలలు గడిచినా బైపాస్ రోడ్డు నిర్మాణానికి సంబంధించి ఒక్క అడుగు కూడా ఇంతవరకు ముందుకు పడలేదు. ఈ నేపథ్యంలో బైపాస్ రోడ్డు నిర్మాణాన్ని త్వరితగతిన చేపట్టి పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణం చేపట్టాలి



బైపాస్ రోడ్డు పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తే పట్టణ ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ట్రాఫిక్ కష్టాలు తీరడమే కాకుండా భారీ వాహనాలు పట్టణంలోకి రాకుండా ఉంటాయి. నూజివీడుకు బైపాస్ రోడ్డు ఎంతో అవసరం కాబట్టి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించాలి.

– పాలేటి సుభాష్ చంద్రబోస్, సీపీఎం నాయకుడు, నూజివీడు

రైతులకు లాభం



బైపాస్ రోడ్డు నిర్మిస్తే పట్టణంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగడమే కాకుండా, రైతులకు కూడా ఎంతో లాభం చేకూరుతుంది. మామిడి తోటల్లో దిగుబడులను సులువుగా మార్కెట్‌కు తరలించేందుకు వీలు కలగడంతో పాటు బైపాస్ రోడ్డు వెంబడి ఉండే రైతుల భూముల ధరలు పెరుగుతాయి. రోడ్డు నిర్మాణాన్ని చేపట్టి పూర్తి చేయాలి.

–బాణావతు రాజు, మాజీ జెడ్పీటీసీ, నూజివీడు

బీసీ బాలికల వసతిగృహాన్ని సందర్శించిన డెప్యూటీ కలెక్టర్

వార్డెన్‌పై విద్యార్థినుల ఫిర్యాదు

మైలవరం: మైలవరం పట్టణంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని డెప్యూటీ కలెక్టర్ మహేష్ (జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి) బుధవారం సందర్శించారు. వసతి గృహంలో సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్ సక్రమంగా విధులకు హాజరు కావడంలేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. వసతి గృహంలో భోజనాలు కూడా అంతంత మాత్రంగానే ఉంటున్నాయని బాలికలు ఆవేదన వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం గత రెండేళ్లలో ఎప్పుడూ భోజనం తయారు చేయలేదన్నారు. కాగా డెప్యూటీ కలెక్టర్ సందర్శనకు వచ్చినప్పటికీ సదరు వార్డెన్ వసతి గృహానికి రాకపోవడం గమనార్హం. డెప్యూటీ కలెక్టర్ మాట్లాడుతూ లిఖిత పూర్వకంగా నివేదిక రాసుకుని, తదుపరి కలెక్టర్‌కు పంపుతామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. వార్డెన్ రమాదేవి అందుబాటులోకి రానందున ప్రస్తుతం బీసీ బాలుర వసతిగృహం వార్డెన్ నరసింహారావుకు బాధ్యతలు అప్పగించారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు విద్యార్థుల ఎంపిక

విస్సన్నపేట: మండలంలోని వేమిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇరువురు జాతీయ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ఎంపికయ్యారు. 8వ తరగతి విద్యార్థులు ఎం అభిషేక్ ఎడ్వర్డ్, బి. చాణిక్యరాం నాయక్ జాతీయ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యారని ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ తెలిపారు. విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు ఆర్. శ్రీనివాసరావును ఆయన అభినందించారు.

వ్యర్థాలన్నీ వాగులోనే

కుళ్లి కంపుకొడుతుండటంతో ఇబ్బందులు





జి.కొండూరు పులివాగు వంతెనకు ఇరువైపులా పేరుకుపోయిన వ్యర్థాలు

జి.కొండూరు: జి.కొండూరు గ్రామస్తులు కొందరు వ్యర్థాలను పులి వాగులో వేస్తున్నారు. గ్రామం మధ్య నుంచి ప్రవహించే ఈ పులివాగుపై ఉన్న వంతెనకు ఇరువైపులా వ్యర్థాలు గుట్టలుగా పేరుకుపోయి కంపు కొడుతున్నాయి. చికెన్, మటన్ వ్యర్థాలతో పాటు గ్రామంలో జరిగిన ఫంక్షన్ల వ్యర్థాలు మొత్తం ఈ వాగులోనే వేస్తున్నారు. వర్షాలు కురిసిన సమయంలో తప్ప మిగిలిన రోజుల్లో వాగులో నీటి ప్రవాహం లేకపోవడంతో వ్యర్థాలు అక్కడే కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లడంతో పాటు ఈగలు, దోమల ఉధృతి పెరిగిపోతోంది. వ్యర్థాలను వాగులో వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రత్యేక డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. గతంలో ఈ వాగులో వ్యర్థాల వల్ల ఈగలు, దోమలు పెరిగిపోయి గ్రామస్తులంతా జ్వరాల బారిన పడిన ఘటనలు ఉన్నాయి. వాగు పక్కనే ప్రభుత్వ కార్యాలయాలు అన్నీ ఉన్నప్పటికీ వాగులో వ్యర్థాలు పేరుకుపోతుంటే అధికారులు ప్రేక్షకపాత్ర వహించడం మినహా ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి వాగులో వ్యర్థాలు వేయకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్డు మార్జిన్

నూజివీడు: పట్టణంలోని ఎంప్లాయీస్ కాలనీలో సిమెంట్ రోడ్డుకు మార్జిన్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. కాలనీలోని చిల్డ్రన్స్ పార్కు రోడ్డులో సిమెంట్ రోడ్డును ఆనుకుని పంట కాలువ ప్రవహిస్తోంది. ఈ మార్గంలో నిత్యం పాఠశాల బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో పాటు పాఠశాల విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. మార్జిన్ అసలు ఏమాత్రం లేకపోవడంతో ఇటీవల సైకిళ్లపై వెళుతున్న విద్యార్థులు ఎదురుగా ఏదైనా భారీ వాహనం వస్తే తప్పుకునేందుకు వీలు లేక పంట కాలువలో పడిపోతున్నారు. ఇక్కడ పంట కాలువ వరద నీటికి సిమెంట్ రోడ్డు వరకు మట్టి కోసుకుపోవడంతో ప్రమాదకరంగా మారింది. రాత్రి సమయంలో వాహనాల హెడ్ లైట్ల వెలుగులో మార్జిన్ కనిపించడం లేదు. మున్సిపల్ అధికారులు స్పందించి పెద్ద ప్రమాదం జరగక ముందే మార్జిన్‌కు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



మార్జిన్ కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న సిమెంట్ రోడ్డు

అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ

నూజివీడు: సమగ్రశిక్ష, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల జెడ్పీ హైస్కూల్ ప్లస్‌లో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇన్‌చార్జి సీడీపీఓ కె.ధనలక్ష్మి మాట్లాడుతూ జ్ఞానజ్యోతి శిక్షణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ తరగతుల ప్రధాన లక్ష్యం అంగన్‌వాడీ విద్యను బలోపేతం చేయడమేనన్నారు.

దీనివలన ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మార్గం సుగమమవుతోందన్నారు. శిక్షణలో పిల్లల స్వభావం, అభ్యసన, పిల్లల పెరుగుదలపై ప్రభావం చూపే అంశాలు, సమగ్ర అభివృద్ధి తదితర అంశాలపై టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ (టీఎల్‌ఎం) ఉపయోగించడం వంటి వాటిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇస్తున్నారు. డిస్ట్రిక్ట్ రిసోర్స్‌పర్సన్లు టి.రమాదేవి, ఎం.సత్యనారాయణ, కె.సురేష్, షేక్ అన్వర్ బాషా, ఎల్.సులోచన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీడీపీఓ ధనలక్ష్మి

జాతీయ సైన్స్ పోటీలకు కోకిలంపాడు విద్యార్థులు

కోకిలంపాడు(తిరువూరురూరల్): బెంగళూరులో జరుగనున్న జాతీయ సైన్స్ పోటీలకు తిరువూరు మండలం కోకిలంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలలో ఏడో తరగతి విద్యార్థులు మన్యశ్రీ, అమృతలు బుధవారం ఈ విద్యా లోక్ ట్రస్టు సహకారంతో గన్నవరం విమానాశ్రయం నుంచి బెంగళూరుకు పయనమయ్యారు. మూడు రోజుల పాటు బెంగళూరులో ఈ పోటీలు జరగనున్నాయని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. జాతీయ సైన్స్ పోటీల్లో బాలికలు విజయం సాధించాలని ఈ విద్యా లోక్ బాధ్యులు అవ్వారి శౌరి ఆకాంక్షించారు.



బెంగళూరు జాతీయ సైన్స్ పోటీలకు వెళుతున్న బాలికలు

పట్టు పురుగుల పెంపకందారులకు ప్రోత్సాహకాలు

ముసునూరు: పట్టు పురుగుల పెంపకందారులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తోందని సెరికల్చర్ డెప్యూటీ డైరెక్టర్ డి.వాణి పేర్కొన్నారు. ముసునూరులో నూజివీడు వ్యవసాయ శాఖ ఏడీఏ విద్యాసాగర్ అధ్యక్షతన పట్టు పురుగులు సాగు చేసే రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పట్టు పురుగుల సాగుకు అవసరమైన మల్బరీ పెంపకానికి సాగుదారులకు ఎకరాకు రూ.22,500, ఎస్సీ, ఎస్టీ రైతులకు ఎకరాకు రూ.27,500 ఇస్తామన్నారు. షెడ్డు నిర్మాణానికి రూ.3,37,500, ఎస్సీ, ఎస్టీ రైతులకు రూ.4,05,000 ఇస్తామన్నారు. రైతులంతా పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలని కోరారు. పట్టు విభాగం అధికారి శ్రీనివాసరావు, ఏఓ చినసూరిబాబు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభాలు



ఆగిరిపల్లి: ట్రాక్టర్ ఢీకొని విద్యుత్ స్తంభాలు విరిగిన ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. మండలంలోని అమ్మవారిగూడెం గ్రామంలో కలటూరుకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ మద్యం మత్తులో అతివేగంగా వచ్చి రోడ్డు పక్కనే ఉన్న మూడు విద్యుత్ స్తంభాలను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభాలు విరిగి నేలపై పడ్డాయి. స్థానికులు అప్రమత్తమై విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తిరువూరు: విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ కృష్ణారెడ్డి తెలిపారు. పీటీకొత్తూరు, మధిర రోడ్డు సెంటర్, జగనన్న కాలనీ, వెంకటేశ్వరస్వామి దేవస్థానం రోడ్డు, బోస్ సెంటర్, వెంకట్రామ థియేటర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

- భవానీపురం(విజయవాడపశ్చిమ): గొల్లపూడి సెక్షన్ పరిధిలోని 11 కేవీ సాయిపురం కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా గురువారం ఉదయం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ (విజయవాడ టౌన్) పి. రవీంద్రబాబు ఒక ప్రకటనలో తెలిపారు. గొల్లపూడి వన్ సెంటర్, రవీంద్ర భారతి పబ్లిక్ స్కూల్, సాయిబాబా టెంపుల్, ప్రభుత్వ కార్యాలయాలు, ఎల్‌ఐసీ కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.

దళితులపై వేధింపులు ఆపాలి

మైలవరం: దళితులపై పోలీసుల వివక్షత, వేధింపులు ఆపాలని ఎంఎస్‌పీ సీనియర్ నాయకుడు కోట దానియేలు మాదిగ డిమాండ్ చేశారు. మైలవరం ఆర్ అండ్ బీ అతిథి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల మైలవరం మండలం మొర్సుమల్లి గ్రామంలో దళితుడు వల్లపూడి సంసోనుకు జరిగిన అన్యాయం చాలా బాధాకరమన్నారు. సంసోనుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడానికి అనుమతినిచ్చిన పోలీస్ అధికారులు, పోలీస్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

బూడిద అక్రమ రవాణాపై ఆగ్రహం

అడ్డుకున్న స్థానికులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ ట్రక్ టెర్మినల్ బూడిద చెరువులో బూడిద అక్రమ రవాణాపై స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. పాత బూడిద చెరువులో బూడిద లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్లు, లారీలను అడ్డుకుని ఆందోళనకు దిగారు. పలువురు మాట్లాడుతూ ఎన్టీటీపీఎస్ అధికారులు నిషేధిత ప్రాంతంగా ప్రకటించిన పాత బూడిద చెరువులో యథేచ్ఛగా బూడిద లోడింగ్ జరపడంతో ఇళ్లపై బూడిద పడుతోందన్నారు. గతంలో మూసివేసిన చెరువులో తిరిగి తవ్వకాలు జరపడం ఏమిటని ప్రశ్నించారు. చెరువు మూసివేసి గ్రావెల్ తోలి ప్లాంటేషన్ చేపట్టారన్నారు. చెరువును తిరిగి రీ ఓపెన్ చేయడం, ప్లాంటేషన్ గుల్ల చేయడం ఏమిటని విమర్శించారు. వార్డు కౌన్సిలర్ రావి ఫణి మాట్లాడుతూ బూడిద అక్రమ రవాణాపై ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ నాగరాజును వివరణ కోరినా ఇప్పటి వరకు స్పందించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బూడిద పైపులను కావాలని లీకేజీలు చేసి పైపుల ద్వారా వచ్చిన బూడిదను గుట్టుచప్పుడు కాకుండా లారీల ద్వారా తరలిస్తున్నారని ఆరోపించారు. బూడిద అక్రమ రవాణాపై స్థానికుల ఆందోళన తెలుసుకున్న తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, ఎన్టీటీపీఎస్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. అక్రమ రవాణాదారులపై స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. స్థానికులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



బూడిద లోడింగ్ చేస్తున్న పొక్లెయిన్‌ను అడ్డుకున్న స్థానికులు

సంసోను కుటుంబానికి న్యాయం చేయాలి

కేవీపీఎస్ నాయకుల డిమాండ్

మైలవరం: చట్టాన్ని రక్షించాల్సిన పోలీసులే ఆ చట్టాన్ని ఉల్లంఘించి అమాయకులపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తున్నారని కుల వివక్ష పోరాట సమితి (కేవీపీఎస్) జిల్లా అధ్యక్షుడు గుండిమెడ క్రాంతి కుమార్ అన్నారు. ఇటీవల మైలవరం మండలం మొర్సుమల్లి శివారు ములకలపెంటలో జరిగిన ఒక హత్యకు సంబంధించి విచారణ పేరుతో మొర్సుమల్లి గ్రామానికి చెందిన దళిత యువకుడు వల్లపూడి సంసోనుపై పోలీసులు థర్డ్ డిగ్రీ ఉపయోగించడంతో బాధితుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. అస్వస్థతకు గురైన సంసోను, అతని కుటుంబాన్ని బుధవారం మొర్సుమల్లి గ్రామానికి వెళ్లి కేవీపీఎస్, ప్రజా సంఘాల నాయకులు పరామర్శించారు. నాయకులు మాట్లాడుతూ పోలీసులు కుల వివక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు అగ్రకులాల వారిని ఒక రకంగా చూస్తూ దళితులను మరో రకంగా చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చివరకు ఈ హత్య కేసులో మృతుని సొంత కుమారుడే హత్య చేశాడని పోలీసులు అతనిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోయినా సంసోనును తీసుకువచ్చి చిత్రహింసలు పెట్టడం తగదని, సంబంధిత అధికారులపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి, శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎం. కుటుంబరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కల్యాణ్, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మంద వెంకటేశ్వరరావు, కోట దానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా డ్రెయిన్ నిర్మాణ పనులు

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆస్పత్రి వద్ద సీసీ డ్రెయినేజీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు కురిసినప్పుడల్లా ఎగువన ఉన్న తోటల్లోని వరదనీరు రోడ్డుపైనే ప్రవహిస్తుండటంతో ఆస్పత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు, స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా ఉండేది. ఈ నేపథ్యంలో మున్సిపల్ పాలకవర్గం ఇక్కడ 120 మీటర్ల సీసీ డ్రెయినేజీ నిర్మాణానికి రూ.4.25 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో సీసీ డ్రెయినేజీ పనులను చేపట్టారు. ముందుగా కాలువ తవ్వి నాలుగు అంగుళాల మందంతో అడుగున కాంక్రీట్ వేసే పనులను పూర్తి చేశారు. అడుగు మందంతో రెండు వైపులా కాంక్రీట్ గోడలను నిర్మిస్తున్నారు. సీసీ డ్రెయినేజీ పనులు పూర్తయితే ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. ఈ రహదారిలోనే ఎగువన ఉన్న ట్రిపుల్ ఐటీలోకి సిబ్బంది రాకపోకలు సాగిస్తున్నారు.



ఏరియా ఆస్పత్రి వద్ద జరుగుతున్న సీసీ డ్రెయినేజీ పనులు

రైతులు విశిష్ట సంఖ్య నమోదు చేసుకోవాలి

ముసునూరు: రైతులు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌లో విశిష్ట సంఖ్యను నమోదు చేయించుకోవాలని నూజివీడు ఏడీఏ విద్యాసాగర్ పేర్కొన్నారు. ముసునూరులో రైతు సేవా కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రైతూ తాను విశిష్ట నంబర్ పొందేందుకు ఖచ్చితంగా నమోదు చేయించుకోవాలన్నారు. మండల వ్యవసాయాధికారి చినసూరిబాబు, వీహెచ్‌ఏలు, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చెరకు లారీ బోల్తా



ఇబ్రహీంపట్నం: నందిగామ నుంచి ఉయ్యూరు చెరకు ఫ్యాక్టరీకి చెరకు లోడుతో వెళుతున్న లారీ బుధవారం తెల్లవారు జామున పశ్చిమ ఇబ్రహీంపట్నం వద్ద అదుపు తప్పి బోల్తా కొట్టింది. రోడ్డుపై చెరకు లోడు పడిపోవడంతో భారీగా ట్రాఫిక్ నిలిచింది. ఘటనా స్థలానికి చేరుకున్న ట్రాఫిక్ ఎస్ఐ బి. లక్ష్మణరావు కూలీలను రప్పించి రోడ్డుపై పడిన చెరకును వేరే లారీలోకి లోడింగ్ చేసి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

నేడు మండల పరిషత్ సమావేశం

విస్సన్నపేట: విస్సన్నపేట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి తెలిపారు. వెలుగు కార్యాలయ సమావేశపు హాలులో జరిగే ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, ఐహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తిరువూరు డివిజన్
99510 20399 (తిరువూరు,
99122 20544 (నూజివీడు)
90102 23734 (మైలవరం)
Office mail : sakshiads@gmail.com